# "చావు"

కాళరాత్రి - చీకటి చిక్కగా పరుచుకొని ఉంది. నడిజాము దాటింది. కొమ్మ కూడా ఊగడం లేదు - వాతావరణం నిశ్చలంగా వుంది - మాఘమాసపు చలి ఎముకలను కొరికేస్తుంది. ఆ భయంకర చలిరాత్రిలో ఊరంతా నిద్రాదేవి ఒడిలోకొదిగిపోయింది. ఆ రోజు చీకటిపడుతుందనగానే రామచంద్రం తల్లి చచ్చి పోయింది. మూడు పాతికేళ్ళుదాటి, కొన్ని మాసాలుగా జబ్బు పడున్న ఆ వృద్ధురాలు ఈ లోకం విడిచిపోయింది. ఆమెది చనిపోయే వయసే. అయినా ఆమె కూతుళ్ళు బంధువులు, దగ్గరివాళ్లు శవంపైపడి భోరుభోరున ఏడ్చారు. రావాల్సిన వాళ్ళు చాలామంది వచ్చారు... ఒకళ్ళిద్దరు తెల్లవారే సరికి వస్తారని ఆశిస్తున్నారు. ఏడ్చి ఏడ్చి అలసిపోయిన వాళ్ళు శవం చుట్టూ ఉన్న అరుగు మీదా, వాకిట్లోనూ కునుకు తీస్తున్నారు. ఊరెంత నిశ్శబ్దంగా వున్నా, రామచంద్రం ఇంటిముందు మాత్రం అప్పుడప్పుడు సన్నగా ఏడుస్తున్న ధ్వని వినబడుతోంది.

తల్లి శవానికి కొంచెం దూరంలో రామచంద్రం తలపట్టుకొని కూర్చున్నాడు. ఏడ్చి ఏడ్చి తన కంఠం బొంగురుపోయింది. మనసు కల్లోలంగా వుంది. తల్లి జ్ఞాపకాలతని కళ్లముందు కదులుతున్నాయి. శరీరం అలసిపోయింది. కళ్లు ఉబ్బి ఉన్నాయి. కన్న తల్లి శవం దగ్గరున్నరామచంద్రానికి కంటిమీద రెప్పకూడా పడటంలేదు.

---

తనెంత ప్రేమగా చూసుకునేది అమ్మ...? తాను తినకుంటే అమ్మ కూడా తినకపోయేది. తాను అలిగితే బుజ్జగించేది. తనకు చిన్న జబ్బొచ్చినా ఎంతో ఆందోళన చెందేది. అమ్మ తినకుండా తనకు పెట్టేది. అమ్మ తనను భుజాల మీదఎత్తుకొనే తిప్పేది. ఆమె వ్యవసాయపు పనులకెళ్లినా మనసంతా తనమీదే... తాను బడికెళ్లినా, ఆమె ఎక్కడికెళ్ళినా ఆమె మనసెప్పుడూ తన చుట్టే పరిభ్రమించేది. అంత కష్టపడినా తాను సుఖపడాలనే భావించేది. తన చదువయిపోయేవరకు, ఆ తరువాత ఉద్యోగ మయ్యేవరకు, పెళ్లయ్యేవరకు అమ్మ తనను ఎంతో ఆప్యాయంగా చూసుకుంది. అనురాగం రంగరించిపోసి పెంచింది. అంతవరకూ తాను తల్లి చాటు బిడ్డగానే పెరిగాడు.

కాని, తనకు పెళ్లయిన తర్వాత అమ్మలో మార్పొచ్చింది. తన నెంతో గారాబంగా పెంచిన తల్లి కోడల్ని ఓర్చేదికాదు. అత్తగా తనకామెపై అధికారం జన్మహక్కుగా భావించేది. ఎంత చిన్న

ప్రతిఘటనొచ్చినా పెద్ద గొడవ చేసేది. తాను పదిసార్లకొక్క సారయినా భార్యకనుకూలంగా మాట్లాడితే పెండ్లాం బెల్లం తల్లి దయ్యమయిందని తిట్టేది. పెండ్లాన్ని వెనకేసుకొస్తున్నావని గోల చేసేది. ముందొచ్చిన చెవులకన్న వెనకొచ్చిన కొమ్ములే వాడి అయ్యాయని ఏడ్చేది... ఇక తానేమనకుండా ఊరుకునేవాడు. కోడల్ని రాచి రంపాన పెట్టింది అమ్మ. క్రమక్రమంగా తన మీద కూడా నిష్ఠూరాలాడటం మొదలు పెట్టింది. తాను అమ్మ మాటను జవదాటకున్నా, పెళ్లయ్యాక మారిపోయాడని అందరికీ చెప్పడం మొదలు పెట్టింది. తనునంత ఆప్యాయంగా చూసుకునే అమ్మ తన పెళ్లయిం తర్వాత ఎందుకలా మారింది? ఏ పరిస్థితులామెలో క్రూరత్వాన్ని ప్రవేశపెట్టాయి...? ఏమో...'

అమ్మ వ్యవసాయ కుటుంబంలో పుట్టింది. మరో వ్యవసాయ కుటుంబంలో అడుగుపెట్టింది. పని... పని... పని... రాత్రింబవళ్ళు పనే... తాను చిన్నప్పట్నుంచీ అమ్మను గమనిస్తున్నాడు. ఎంత పని చేసినా, ఆమె ఒక్క మెచ్చుకోలు మాటను కూడా వినేదికాదు. నానమ్మ అమ్మను ఎంతో వేదనకు గురి చేసేది. అనవసరంగా తిట్టేది. ఒక్కోసారి కొట్టేది కూడా. అయినా నాన్న పట్టించుకునేవాడుకాదు. నానమ్మకు నాన్న కూడా భయపడేవాడు. నానమ్మ ముందు నాన్న ఎప్పుడూ అమ్మతో ఆప్యాయంగా మాట్లాడగా తను చూళ్ళేదు. నానమ్మ అమ్మతో రాక్షసంగా ప్రవర్తించేది. అమ్మను కాల్చుకుతినేది. దానికతోడు ఆర్థిక ఇబ్బందులు. ఎంత చేసినా కుటుంబం గడవడమేకష్టంగా వుండేది. అయినా, అమ్మ తన గురించి అశ్రద్ధ చేసేది కాదు.

ఇద్దరు ఆడపిల్లల తర్వాత పుట్టిన తనపై ఎంతో ప్రేమ చూపేది. తాను చదువుకొని పైకి రావాలని బడికి పంపించింది. నానమ్మ పెడుతున్న హింసను భరిస్తూ కూడా తనకాప్యాయత నందిస్తూ పెంచింది. నానమ్మ బతికున్నన్ని రోజుల్లో ఎన్నో హింసలను భరించిందమ్మ. ఆమె మరణించిన తర్వాత కొంచెం ఊపిరి పీల్చుకుంది. అటు తర్వాత కొద్ది రోజులకే నాన్న మరణించాడు. కుటుంబ భారాన్ని భుజాలపై వేసుకుందమ్మ. అక్కల పెళ్లిళ్లు చేసింది. తానెన్ని ఇబ్బందులు పడుతున్నా, చదువు పూర్తి చేయించింది. అదృష్టవశాత్తు తనకు తొందరగానే ఉద్యోగం దొరికింది. అప్పుడు అమ్మ హాయిగా ఊపిరి పీల్చుకుంది తన కష్టాలు గట్టెక్కాయని భావించింది. ఉద్యోగం వచ్చిన సంవత్సరంలోగానే తనకు పెళ్లయింది.

తానూ తన భార్య కలిసిమెలిసి అన్యోన్యంగా వుండటం సహించలేక పోయిందమ్మ. భార్య వచ్చిన తర్వాత తాను అమ్మకు దూరమవుతున్నట్లు తానే భావించింది. అమ్మ అనుభవించని సుఖమేదో తన భార్య అనుభవిస్తున్నట్లు అసూయ చెందింది. తన నానమ్మ రాచిరంపాన పెట్టడం, క్రూరంగా హింసించడం నాన్న పట్టించుకోకపోవడం, ఆర్థిక ఇబ్బందులు అమ్మలోని సున్నితత్వాన్ని నిర్దాక్షిణ్యంగా తుంచివేసాయి. తను కష్టపడి పెంచి ప్రయోజకుని చేసిన కొడుకు ఇతరుల పాలవుతున్నట్లు భావించి కోడలిపై కక్ష పెంచుకుంది. పెళ్లయినప్పట్నుంచీ ఆమె నుంచి కోడలు కొడుకును దూరం చేస్తుందేమోనన్న కక్షతో, తాను తన అత్తతో అనుభవించినహింసకంటే ఎక్కువగా కోడల్ని హింసించేది. తాను మట్టిలో మట్టయి పనిచేస్తూ కొడుకును పెంచితే, కోడలు తెల్లనిబట్టలతో సుఖపడుతుందని ఆమె మరింత కక్ష పెంచుకుంది. భార్య తనకు అమ్మ గురించి ఎన్నోసార్లు చెప్పింది. తానుకూడా అనేకసార్లు చూసాడు. అమ్మకు చెప్పి చూశాడు. ఫలితం శూన్యం పైగా తనను కూడా పరాయివాడుగానే చూడటం మొదలు పెట్టింది. 'అడ్డాలవాడు బిడ్డలుగాని గడ్డాలవాడా'? అంటూ శోకాలు తీయడం మొదలు పెట్టింది. భార్యనే

ఎలాగోలా సర్దుకొమ్మని చెప్పేవాడు తను. తనకనుకూలవతియైన భార్య దొరికింది. కాబట్టి, ఇంటిగుట్టు బయటపడకుండా నెట్టుకొచ్చిందామె.

--

రామచంద్రం మనసు క్షోభిస్తుంది. అమ్మ గురించి ఆలోచనలతో కలత చెందింది. కళ్లవెంట జలజలా నీళ్ళు రాలాయి. చీకటి మరింత చిక్కబడింది. అక్కడున్న వాళ్లలో అందరికీ కలత నిద్రలే కాని నిద్రపట్టడం లేదు. మధ్యమధ్య చనిపోయినావిడ కూతుళ్ళ ఏడ్పు వినబడుతోంది.

అమ్మ గురించి ఇలా ఆలోచిస్తున్నానేంటి నేను? ఈ సమయంలో అమ్మ చేసిన పనులన్నీ ఎందుకు జ్ఞాపకం వస్తున్నాయి? తనను తానే ప్రశ్నించుకున్నాడు రామచంద్రం. శవం చుట్టు చేరిన ఇరుగుపొరుగు జనాలన్న మాటలు రామచంద్రపురం చెవుల్లో గింగురు మంటున్నాయి.

"కొడుకు మీదెంత ప్రేమా లక్ష్మమ్మకు...?''

"కొడుకు మీదికంటే ఆడబిడ్డలమీదే ఎక్కువ ప్రేమ...''

"కోడల్ని మాత్రం కాల్చుకుతింది.''

"కొడుకయితే తల్లి మాట జవదాటేవాడుకాదు పాపం...''

"రామచంద్రం పాపం మంచోడు...''

"బుద్ధిమంతుడు రామచంద్రం కొడుకంటేగట్లుండాలే...''

"లక్ష్మమ్మ మంచిదేకాని, కొడుకును దోచి బిడ్డలకు పెట్టింది.''

"కొడుకునయితే అప్పుల పాల్జేసింది.''

---

తన అక్క లిద్దర్ని వ్యవసాయ కుటుంబాల్లోకిచ్చింది. తనకుద్యోగమైన తర్వాత అమ్మ తన అక్కలిద్దరు కష్టపడుతున్నట్టు భావించింది. ఆమె కడుపున పుట్టిన బిడ్డలిద్దరూ మోటు కష్టం చేస్తూ బతుకుతుంటే ఎక్కణ్నించో వచ్చిన కోడలు తనకుద్యోగమవడంవల్ల సుఖపడుతుందని భావించిందమ్మ. తన పరిస్థితి కూడా చూడకుండా, తనతో ఖర్చు పెట్టించింది. పండుగలు పబ్బాలు యాంత్రిక జీవనంలో కొంత సంతోషాన్నివ్వ డానికుపయోగపడాలి. కాని, పండుగొస్తుందంటే తాను భయపడేవాడు. ఖర్చులు భరించలేక ఇబ్బందిపడేవాడు.

"కొడుకా అక్కలను దీసుకూరా...'' అని ప్రతి పండుగకు నాల్గైదు రోజుల ముందేరప్పించేదమ్మ. ఇద్దరి చే మూడు కాన్పులకు తన తోనే ఖర్చు పెట్టించింది. ప్రతి పండుగకూ పిలిపించి ఖర్చులే కాకుండా కట్నాలు కొంత డబ్బిప్పించి పంపించేది.

"నీకేం రంది బిడ్డా నౌకరుంది. వాళ్లు మోటు కష్టంజేసెటోల్లు...'' అని తనను మాట్లాడ నిచ్చేది కాదు.

బట్టలూ వగైరా పెట్టడానికి ప్రస్తుతం వెల్లదన్నా వినేది కాదు. '2నేను బతికున్నంత వరకే వాళ్లకు పెట్టేది.నేను పోయిం తర్వాత నువ్వు పెడతావన్న నమ్మకం లేదు. నువ్వు పెడదామనుకున్నా నీ భార్య పెట్టనివ్వదు'' అని నిష్ఠూరాలాడేది.

''మనకు వెళ్లినప్పుడే పెట్టాలి. ఎంతకాలమమ్మా ఇలా'' అనేవాడు తాను.

'' ఆడ బిడ్డలకు పెడితే ఏంబోదు. నేనున్నంత వరకూ నడువనీ'' అనేది అమ్మ.

''అమ్మా అప్పులుచేసి లాంఛనాలు అందించడం సరికాదమ్మా'' అనేవాడు తాను.

''అక్కలకు పెడితేనే అప్పులవుతున్నాయా...? మంచికొడుకువే పుట్టినవు బిడ్డ...'' అని సాధించేది.

ఇక తనకు తప్పేది కాదు.

అక్కల కాన్పులకే కాకుండా వాళ్ల పిల్లల పెళ్లిళ్లకు కూడా తనతో అప్పు చేయించైనా సరే డబ్బు ఇప్పించిందమ్మ.

''అమ్మా! నాది పెద్దుద్యోగం కూడా కాదు. అప్పుల పాలైతే తీర్చడం కష్టం. ఈ రోజుల్లో ఎవరి కుటుంబాన్ని వాళ్ళు చూసుకోవడమే కష్టం'' అనేవాడు తను.

''నేను చెప్పినట్లువినకుంటే నన్ను చంపుకుతిన్నట్టే'' అని ఏడుస్తూ తన మాట సాగించుకునేదమ్మ.

తనకోసమెంతో కష్టపడ్డ అమ్మను బాధపెట్టొద్దని ఓ దిక్కు, ఆర్థిక ఇబ్బందులుమరో దిక్కూ రెండింటి మధ్య తను నలిగిపోయేవాడు.

''అక్కలకు, అక్కల పిల్లలకు, వాళ్లకు పుట్టిన పిల్లలకు కూడా నాతో ఖర్చు పెట్టించావమ్మా. ఎంత సంప్రదాయమైనా ఈ రోజుల్లో ఇవన్నీ భరించడం కష్టమమ్మా- నన్నప్పులపాలుచేస్తున్నావమ్మా'' అనుకునేవాడుతనలోతాను.

ఒక్కోసారి అమ్మ తొందరగా చనిపోయినా బాగుండుననుకునేవాడు.

---

రామచంద్రం కళ్ళ వెంట ధారాపాతంగా నీళ్ళు. మనసులోకల్లోలం ఎంతక్రూరంగా ఆలోచించేవాడు తాను? అలాంటి అమ్మ ఈ రోజు చనిపోయింది. తన కందని దూరతీరాలకు వెళ్లి పోయింది. కానీ బోలెడన్ని అప్పులు మిగిలాయి.

పక్కన శవాన్ని పెట్టుకొని, ఇక కనిపించని అమ్మ మృతదేహాన్ని పెట్టుకొని, తానీవిధంగా ఆలోచిస్తున్నావేంటి? ఈ సమయంలో కూడా ఆర్థిక ఇబ్బందుల పైనే ఆలోచనలు పోతున్నాయేంటి? నేను మాతృద్రోహం చేస్తున్నానా? తన ఈ ఆలోచనలు అసహజమైనవా? తనను తానే ప్రశ్నించుకున్నాడు రామచ్రందం.

సమాధానం దొరకలేదనికి కాని ఎంత వద్దనుకున్నా అవే ఆలోచన లొస్తున్నాయి. పెళ్ళి కెదిగిన కూతురు. ఉద్యోగం లేని కొడుకు. ముందున్న అప్పులు అతని కళ్ళముందు కదులుతున్నాయి. తెల్లవారితే జరుగబోయే తంతు. ఈ పదిరోజుల్లో జరిగే ఖర్చు గురించి చెయ్యాల్సిన కొత్త అప్పుల గురించి జ్ఞాపకం చేసుకుంటూ భయపడుతున్నాడు రామచంద్రం.

పుట్టిన ప్రతివాళ్లూ చనిపోవటం సహజం అనివార్యం కూడా. కాని ఎన్నేళ్ళు బతికినా తమకు సంబంధించిన వాళ్లు దూరమౌతుంటే తట్టుకోవటం కష్టమే. తనఎంత అప్పుల పాల్జేసినా మాతృ వియోగం రామచంద్రానికి కష్టంగానే వుంది. చావు సందర్భంగా అయ్యే ఖర్చులు భరించడం మరింత కష్టంగా ఉంది. అమ్మ, కాబోయే అప్పులు కళ్లముందు కదిలి సన్నగా రోదిస్తున్నాడు రామచంద్రం.

''ఏడ్చి, ఏడ్చిసగమయ్యావు... ఆగు బావాగు... ఎంతేడ్చినా పోయిన మనుషులు తిరిగొస్తారా?'' అని ఓదార్చాడు రామచంద్రం పెద్దబావ దగ్గిరికొచ్చి.

అక్కడున్న చాలామంది లేచి కూచున్నారు. రామచంద్రం అక్కలు శవాన్ని తాకుతూ ఏడుస్తున్నారు.

కోడి కూసింది. చెట్లపై పిట్టలు కిచ్‌కిచ్‌మంటున్నాయి. ఇరుగుపొరుగువాళ్ళు, పెద్ద మనుషులు కొందరక్కడికి చేరుకున్నారు. ఒకతనొచ్చి రామచంద్రం భుజం మీదచెయ్యేసాడు. ''నీ తల్లిని నువ్వు చాలా బాగా చూసుకున్నావు. ఆమెకు నువ్వేం లోపం చేయలేదు. అవతల తెల్లవారుతోంది... చేయాల్సిన కార్యక్రమం గూర్చి ఆలోచించు...'' అన్నాడు.

రామచంద్రం కన్నీళ్ళు తుడుచుకున్నాడు. ఏం మాట్లాడలేదు.

''ఇంట్లో ఏమైనా డబ్బుందా...?'' అడిగాడతను.

''లేదు. ఉన్నాయాభయో, నూరో చిల్లరుండవచ్చు...'' అన్నాడురామచంద్రం.

''శవ దహనానికి కట్టెలు కొనుక్కురావాలి'' అన్నాడతను...

''దహనానికి ఐదారువందల రూపాయలకట్టెలైనా కావాలి. తల్లిని పూడ్చిపెడితేనో?'' పైకనకూడదనుకుంటూనే అన్నాడు.

''లింగధారులైతే శవాన్ని పూడుస్తారు... మీరు లింగదారులుకాదుగదా! మీ వంశంలో బొందపెట్టడం ఎప్పుడైనా చూశావా...?'' మందలించాడతను.

''బాగా బతికింది లక్ష్మమ్మ... కడుపు నిండకన్నది. మనుమలను, మనుమరాళ్ళను, వాళ్ళ పిల్లలను చూసింది... పూడ్చి పెడతామనడానికి నీకు నోరెలా వచ్చింది...?'' ఓ వృద్ధురాలంది.

''ఖర్చుకు భయపడుతున్నావా? ఆమె లాగూ పోయింది. తర్వాతామెకు నువ్వు పెట్టేదేముంది? ఇదే చివరి ఖర్చాయె...'' అన్నాడు మరొకతను.

''సరే దహనమే చేద్దాం...'' అన్నాడు రామచంద్రం.

ప్రస్తుతం రామచంద్రం దగ్గర డబ్బు లేదు. కాబట్టిషావుకారి దగ్గర అప్పుతెచ్చి పని ఒడ్డెక్కించడానికి బయలుదేరారు. పెద్దమనుషులు. దహనం ఏర్పాటు చేయడానికి రామచంద్రం బావను వెంటతీసుకెళ్లాడు.

సూర్యుడు తూర్పు చీకట్లను చీల్చుకుని బయటకొస్తున్నాడు. శవం దగ్గర చాలమంది చేరారు. లక్ష్మమ్మకు జిల్లా దాటి రావాల్సిన బంధువులెవరూ లేరు. కాబట్టి దాదాపందరూ చేరుకున్నారు. కొత్తవాళ్లొచ్చినప్పుడల్లా శవం దగ్గర ఏడ్పులు తారస్థాయినందుకుంటున్నాయి.

రామచంద్రం అక్కలు శవంమీద పడి వల్లిస్తూ ఏడుస్తున్నారు.

''మమ్మల్నేం జేసి పోతివే అమ్మా...?''

''మాగతేం కావాలే అమ్మా...?''

''మాకింక దిక్కెవ్వరే అమ్మా...''

ఇరుగుపొరుగు ఆడవాళ్లు వాళ్ల నోదారుస్తూ కన్నీరు కారుస్తున్నారు.

బారెడు పొద్దెక్కేసరికి కాడుసిద్ధం చేసి, ఇంటికొచ్చారు రామచంద్రం బావ ఇతర పెద్ద మనుషులు. ఊరి మాదిగలు పాడెగట్టారు. పాడె పై లక్ష్మమ్మ శవాన్ని పెట్టారు. పై నుంచి తెల్లటి కొత్త బట్ట కప్పి ఈతనారతో బిగించారు. అందరూ భోరు భోరున ఏడుస్తుండగా ''గోవిందా... గోవిందా...'' అంటూ పాడె నెత్తాను. అగ్గి కుండ ఎడమచేతిలోపట్టుకుని రామచంద్రం ముందు నడుస్తున్నాడు. డప్పుల చప్పుడుతో, ఆత్మీయుల శోకాలతో శవం కాడు దిక్కు సాగిపోతోంది... ఒకతను

గోవిందా, గోవిందా అంటూ శవంపై బోలుప్యాలాలు చల్లుతున్నాడు. ఊరు బయట పాడె కింద పెట్టి, శవాన్ని చూశారు. ఒకటి రెండు నిముషాలుంచి మళ్ళీ ఎత్తారు.

శవం ముందు నడుస్తున్న రామచంద్రానికి ఎంత వద్దనుకుంటున్నా జరగబోయే ఖర్చు, అప్పు కళ్లముందు కదులుతున్నాయి. బలవంతంగా ఆ ఆలోచనను పక్కకు పెట్టాడు. శవం శ్మశానం చేరుకుంది. చేయాల్సిన తతంగమంతాచేసి శవాన్ని పాడెపై పెట్టాడు. శవం పై నుండి మరికొన్ని కట్టెలు పేర్చారు. రెండు డబ్బాల్లో తెచ్చిన కిరోసిన్ పాడెపై అక్కడక్కడ పోశారు. రామచంద్రం పాడెచుట్టూ రెండు మూడు చుట్లు తిరిగి అగ్గికుండను వదిలిపెటాడ్డు. శవానికి నిప్పంటించాడు. అందరి శోకాలు మిన్ను మిడుతుంటే, మంటలు గుప్పుమని లేచాయి. ఉన్నవాళ్లను, లేనివాళ్లను ఏమాత్రం భేదం లేకుండా తనలో కలుపుకునే ఆ శ్మశానంలో జనమంతా చూస్తుండగానే లక్ష్మమ్మ శరీరం బూడిదవుతోంది. కాష్టం కాలుతుండగానే వాళ్ళంతా దగ్గరున్న చెరువు దగ్గిరికివెళ్ళి స్నానాలు చేశారు. వాళ్ళు స్నానాలు చేసి తిరిగి వచ్చేసరికి మధ్యాహ్నం దాటింది. శవంకాలి బూడిదయింది. ఎర్రగా నిప్పు స్మశానంలో మెరుస్తోంది. వాళ్లంతా కొద్దిసేపక్కడ కూర్చున్నారు.

''ఎవరయినా పోవాల్సినవాళ్ళే''

''మున్నాళ్ళ ముచ్చటకు మనిషికెంత ఆరాటం.''

''ఎవ్వరెంత సంపాయించినా వెంటేం తీసుకుపోరు మంచి తప్ప'' ఇలాకొద్ది సేపు ఆశాశ్వతమైన బతుకు గూర్చి, చనిపోయిన తర్వాత దొరికే ముక్తి గూర్చి, అందుకోసం చెయ్యాల్సిన మంచి పనులగూర్చి, మాట్లాడుకుని అంతా లేచారు. అందరూ ఇల్లు చేరుకున్నారు. అరుగు మీద మంచంలో కూర్చునుండో పడుకొనుండో మూల్గుతూ సందడి చేస్తూ వుండే లక్ష్మమ్మ లేనిల్లు బోసిగా కనబడుతోంది. రామచంద్రం దగ్గరివారు ఊరి పెద్ద మనుషులు బంధువులంతా అరుగు మీద కూర్చున్నారు. అందరి ముఖాల్లో విచారం. అంతా నిశ్శబ్దం. ఆ ఇల్లును శ్మశానవైరాగ్యం ఆవరించింది. కొద్దిసేపు ఎవ్వరూ ఏం మాట్లాడలేదు.

''రామచంద్రం.. ఈ పదిరోజులు ఇంటి ముందు పురాణం చెప్పిద్దాం. అమ్మకు పుణ్య లోకాలు ప్రాప్తిస్తాయి'' అన్నాడని మిత్రుడు.

''అవును అవును'' అని అందరూ అతన్ని సమర్థించారు.

''ఎదిగిన పిల్లలు... పెరిగిన ఖర్చులు. పెరగని జీతం... ఎదగనూ బొదుగూలేని బడిపంతులుద్యోగం... పెరుగుతున్న అప్పులు...'' ఆ సమయంలోనూ ఇవన్నీ జ్ఞాపకం వచ్చిమిత్రుడా మాటలనగానే గతుక్కుమన్నాడు రామచంద్రం. ''మీదేం పోతుంది...? ఎన్నైనా చెబుతారు పోయినమ్మ ఎలాగూ పోయింది... కాని ఉన్నవాళ్లు చావకుండా చూసుకోవాలి'' తనలోతానే అనుకున్నాడు. '' ఇప్పుడవన్నీ ఎందుకు?...'' పైకన్నాడు మెల్లిగా.

''కన్నవాళ్ళను పున్నామ నరకం నుంచి తప్పించాల్సింది కొడుకు. అలా అనకూడదు రామచంద్రం. ఈ పదిరోజులుపురాణం చెప్పించాల్సిందే..'' అన్నాడు ఓ పెద్దమనిషి.

ఆ సమయంలో గట్టిగా ప్రతిఘటించలేకపోయాడు రామచంద్రం. అందరూ తప్పదనేసరికి ఔననక తతప్పలేదనికి.

ఒకతను ''మంథని'' వెళ్ళి పురాణం చెప్పే ఓ పండితున్ని అతని అనుచరులిద్దర్ని తీసుకొచ్చాడు. రోజు రాత్రిళ్ళు గరుడ పురాణం, భాగవతంలోని కొన్ని ఘట్టాలు చెబుతున్నాడా పండితుడు. ఊరివాళ్ళు చుట్టుపక్కలవాళ్ళు, బంధువులు వింటున్నారు. రామచంద్రానికి తల్లిపై వున్న ప్రేమను గూర్చి

మాట్లాడుకుంటున్నారు.

ఐదవ రోజు పిట్టకు పెట్టారు. ఆచారం ప్రకారం అందరినీ తాగించాడు రామచంద్రం. చాలామంది బంధువులులతన్ని విచారించేనెపంతో అక్కన్నే వున్నారు. ఇంటినిండా మందే.

మాతృ వియోగం రామచంద్రానికి బాధాకరంగానే వుంది. కాని అవుతున్న ఖర్చు భరించరానిదిగాను మరింత బాధాకరంగానూ వున్నది.

మంథని పండితులకు బాగానే ముడుతోంది. తల్లికి ఉత్తమలోక ప్రాప్తి కొరకు గో, భూ, హిరణ్య దానాల్లాంటివి చేయాలన్నారు ఊరి పురోహితులు... ''నేనే అడుక్కునే స్థితిలో కొస్తున్నాను. ఇంకేం దానాలు?'' తనలో తానే అనుకున్నాడు. కాని ఔననకు తప్పలేదు. ఈ సమయంలోనే కులం వాళ్ళనడుక్కునే జానపద కథకులచ్చొరు. ''మీ తల్లిపేరు మీద దండిగాకథలు చెబుతామన్నారు'' వాళ్లు... రామచంద్రానికి వద్దందామనున్నా ఎలాగూ అందరు బలవంతం చేసి ఒప్పిస్తారని సరేనన్నాడు.

తొమ్మిదోరోజున మళ్ళీ పిట్టకు పెట్టారు. బంధువులకు, కులం వాళ్లందరికీ తాగించాల్సి వచ్చింది. రామచంద్రానికి గుండుచేయించారు. జరుగుతున్న తతంగమంతా చూస్తున్న రామచంద్రానికి రేపటి గూర్చి ఆందోళనగా వుంది. ఈ పుణ్యభూమిలో చావు కూడా పెండ్లిలాంటిదే అని, తనలోతానే గొణుక్కున్నాడు. పిట్టకు పెట్టి, స్నానాలు చేసి అంతా ఇంటికొచ్చారు.

'' ఈ రోజుపిట్ట సరిగా ముట్టలే...'' అన్నాడు రామచంద్రం చినబావ.

''చనిపోయిన వాళ్ళ ఇష్టం మేరకు జరుగకుంటే పిట్టముట్టదు'' అన్నాడు అతని పెద్దబావ.

''తల్లికేం తక్కువ చేస్తున్నాడురామచంద్రం? ఆమెకేం కావాలని వుండేదీ...?'' అన్నాడు చంద్రారెడ్డినే ఊరతను.

''మా అమ్మ తనమీదున్న నగలు మాకే ఇస్తానంది...'' అంది రామచంద్రం పెద్దక్క.

''నిజమే నాతోని కూడా అలాగే చెప్పింది...'' అంది చిన్నక్క.

''తల్లి మీదున్న సొమ్ము ఆడబిడ్డలకే చెందుతుంది'' అన్నాడు బంధువు.

'' ఇది మనకుటుంబాల్లోనడుస్తున విషయమేనాయే...'' మరో బంధువు.

''అమ్మ మీద నాను తాడుండె... చేతికి కడియముండె. చెవులకు పోగులుండె. నల్లపూసల గుండ్లుమొత్తం నాలుగుతులాల బంగారముంది. యాభైతులాల వెండి... చెరిసగం రావాలి'' అంది పెద్దక్క.

రామచంద్రం మనసంతా గజిబిజిగా వుంది. తల్లిపోయినందుకు దు:ఖంగానూ, జరుగుతున్న విషయాలకు చికాకుగానూ వుంది.

''చెరో తులం బంగారం ఇచ్చేస్తా, వెండిజోలికిరావద్దు...'' అన్నాడు.

''లేదు అమ్మ మీది సొమ్మంతా మాకే రావాలి'' అని ఏడ్వడం మొదలు పెట్టారు అక్కలిద్దరు.

అతనికెంత ఆపుకుందామన్నా కోపం ఆగడంలేదు. కర్మకూడా పూర్తికాక ముందే సొమ్ములనెపం మీద ఏడుస్తున్న అక్కలిద్దరిపై అసహ్యం వేసింది.

''అన్నీ భరించాల్సింది నేను. సొమ్ములు మాత్రం మీకు కావాలా?. రేపీ బాకీలన్ని ఎవరు తీరుస్తారు? పిసరెత్తు బంగారం కూడా ఇవ్వను. ఏం చేసుకుంటారో చేసుకోండి'' అన్నాడు ఆవేశంగా రామచంద్రం.

అక్కలు శోకాలు తీస్తున్నారు.

''రామచంద్రం నువ్వెంతో శాంతపరుడివి. ఈ సమయంలో ఇలా ఆవేశపడడమేంటి?'' అని

అతన్ని సముదాయించారు. పెద్దలు. తర్జనభర్జనలు చేశారు. ఆడుబిడ్డల నేడ్పిస్తే మంచిదికాదన్నారు. తల్లి ఆత్మను శాంతింపజేయడం ముఖ్యమన్నారు. ఎలాగోలా అతన్నొప్పించి ఆడబిడ్డలకు చెరో తులంనర బంగారమివ్వడానికి, మిగిలిన తులం రామచంద్రం ఉంచుకోవడానికి అంగీకరింపజేశారు. వెండిలో కూడా కొంత భాగం ఆడబిడ్డల కివ్వాలి... అయినా ఆడబిడ్డలుశోకాలు తీస్తూనే వున్నారు.

ఇక పదకొండో రోజు జరిగే పెద్దకర్మ ఏర్పాట్లు గూర్చి చర్చమొదలైంది.

''ముసలమ్మ బాగా బతికింది. అందర్ని చూసింది. కర్మ దండిగా చేయాలి'' అన్నాడో ఊరతను.

''కనీసం నాలుగుయాటలైనా తెగాలి. ఇలాంటప్పుడు పప్పన్నం పెట్టడం బాగుండదు'' అన్నాడో బంధువు.

తలపట్టుకున్నాడు రామచంద్రం.

తాను ఏమన్నా తల్లికి ఖర్చు పెట్టడానికేడుస్తున్నాడని నిందిస్తారు. ఎంత ఖర్చు పెట్టినా నిందిస్తున్నారు కదా... వద్దనుకున్నా ఔననక తప్పలేదు. పెద్దకర్మరోజు నాలుగు యాటలు తెగాయి. దాదాపు బంధువులందరికీ తాగించడం జరిగింది. దానాలు దండిగానే జరిగాయి. కర్మ బాగాచేశాడనీ రామచంద్రాన్ని ఊరివాళ్ళు పొగిడారు.

తెల్లవారి పండితులు, జానపద కథకులు పురోహితులు డబ్బు దానాలు తీసుకుని ఎక్కడి వాళ్లక్కడకు పోయారు. బంధువులంతా కూడా వెళ్ళిపోయారు. రామచంద్రం అక్కలు, బావలు మరో రోజుండి వెళ్ళిపోయారు. పోయేటప్పుడు ''మా తమ్ముడు మాకు అన్యాయం చేశాడు. అమ్మ మీది సొమ్ము మొత్తమీయలేదు. ఆడబిడ్డలనేడిపిస్తేమంచిది గాదు...'' అని శాపనార్థాలు కూడా పెట్టారు.

ఇల్లంతా బోసిగా వుంది. రామచంద్రం తల్లి చావు ఘట్టం పూర్తయింది.

రామచంద్రం కష్టాలు ఆ తర్వాతే మొదలయ్యాయి.

ఇన్ని రోజులుగా అయిన ఖర్చులకు డబ్బిచ్చిన వాళ్లంతా రావడం మొదలు పెట్టారు. మొత్తం ఖర్చు పదిహేను వేల వరకయింది. ఇంతవరకున్న అప్పులకు తోడు ఇదో అప్పు. ఈ అప్పు లెలా తీర్చాలో అతని కర్థం కావడంలేదు. ఉన్న కొద్దిపాటి భూమి, తల్లిద్వారా సంక్రమించిన తులం బంగారం, భార్యమీదున్న కొద్దిపాటి బంగారం అమ్మక తప్పలేదు. అయినా ఇంకా అప్పులు మిగిలేవున్నాయి. వాట్ని తీర్చడానికి అమ్మడానికింకేం మిగలలేదు. మిగిలన అప్పులెలా తీర్చాలో, ఎదిగినపిల్లలకేం దారి చూపెట్టాలో అర్థంకాక తలపట్టుకున్నాడు సగటు మనిషి రామచంద్రం.

వెళ్లిపోతూ అక్కలు పెట్టిన శాపనార్థాలను జ్ఞాపకం చేసుకుంటూ రామచంద్రం ''అమ్మా నాకెంత అవసరముందనిచెప్పినా, అప్పులున్నాయని చెప్పినా నీ మీదున్న బంగారమియ్యంది ఇందుకేన అమ్మా...'' తనలో తానే అనుకున్నాడు.

''అమ్మా! కష్టం లేదన్న మాటేకానిచావనేది పెళ్లికంటే ఎందులోనూ తక్కువకాదు. చావుతో నీ జీవితం ముగిసింది. కాని నాకుచావు మొదలైంది.'' తనలో తాను గొణుక్కున్నాడు.


అరుగుమీదున్న నులకమంచంలో వెల్లికిలా పడుకొని ఇంటికప్పుకేసి చూస్తున్నాడు రామచంద్రం అతని కంతా శూన్యంగా అగపడుతోంది. తల్లి జ్ఞాపకాలతనికి వేదన కలిగిస్తున్నాయి. తల్లి శవాన్ని ప్రక్కన పెట్టుకుని, తను ఆర్థిక పరిస్థితిని గూర్చి ఆలోచించిన జ్ఞాపకాలు మదిలో మెదిలి, తనను తాను

నిందించుకున్నాడు రామచంద్రం తనలాంటి మధ్య తరగతి మనస్తత్వం గల సగటు మనిషి బతికిందెప్పుడు? అటు పైకెక్కే శక్తిలేక చావు... ఇటు కిందకి దిగే ధైర్యం లేక చావు.. ఎవరేమన్నా ఏమనుకుంటారోనన్న చావు. ఆత్మాభిమానం చంపుకోలేక చావు.. చాలీచాలని ఆదాయంతో ఆర్థిక ఇబ్బందులెదుర్కోలేక చావు... తనలాంటివాడు రోజూ చస్తూనే వున్నాడు. ఈ చావుకంటే ఆ చావే నయమేమో.

రామచంద్రం మదిలో ఎన్నో ఆలోచనలు.

ఈనాడు ఆదివారం 25.3.90
కేంద్ర సాహిత్య ఆకాడమీ... సంకలనం
(ఒకతరం తెలుగ కథ లోంచి...)




CHANDRA